
# యద్యదాచరతిశ్రేష్ఠః

ఎ.వి.వి.యస్.యస్.ప్రసాద్.
మూర్తిరాజా



ఎక్కడో ఎప్పుడూ పేరు కూడా వినని ప్రాంతానికి నన్ను అపాయింట్ చేశారు–

ఇన్నేళ్ళు కష్ట పడి చదివింది ఎక్కడో ప్రపంచానికి దూరంగా వున్న పల్లెటూళ్ళో పని చేయడానికా?

ఎం బి బి యస్ ప్యాస్ అయిన వెంటనే ప్రాక్టీసు పెట్టడం ఇష్టం లేక గవర్నమెంట్ వుద్యోగానికి అప్లయ్ చేశాను–

వారం క్రితం అపాయింట్ మెంట్ ఆర్డర్ వచ్చింది

ఏదో పాలెం ట !

ఇన్నేళ్ళ జీవితంలో నేను చాలా వూర్లు చూశాను ఎప్పుడూ ఆవూరు పేరు కూడా వినలేదు ఇప్పుడు ఈ ఆర్డర్ వచ్చాకా ఆ పేరుతో ఓ వూరుందని తెలిసింది !

ఆ వూరు వెళ్ళే వుద్దేశం లేక పోయినా చాలా మందిని ఆవూరు గురించి అడిగాను ఎవరికీ ఆవూరు గురించి తెలీదుట

చివరికి–

ఇవాళ పొద్దున్నే–

ఆ వూరు గురించి తెలిసింది

మా ఫ్యామిలీ ఫ్రండ్ ఒకాయన జాగ్రఫీ ప్రొఫెసర్

మొదట్లో ఆయన కూడా ఆ పేరు విని అసలా పేరుతో ఓ వూరువుందా(?) అని ఆశ్చర్య పడినా తరువాత తన కొలీగ్స్‌ని ఎంక్వయిరీ చేసి కనుక్కున్నారుట

వాస్కోడి గామా ఇండియాని కనిపెట్టినంత సంబర పడి పోతూ–

తెలిసిందోయ్ ప్రసాదూ మొత్తానికి తెలిసింది నువ్వడిగిన పాలెం దారి కనుక్కున్నాను ఇక్కడ్నుంచి బస్సు మీద ప్రయాణం చేసి ఏ పాలెం చేరుకొని అక్కడ్నుంచి రైల్లో బి పాలెం వెళ్ళి అక్కడ ఎద్దుల బండో జట్కాబండో ఎక్కి స పాలెం వరకు వెళ్ళి మధ్యలో బల్ల కట్టు మీద ప్రయాణం చేసి అక్కడ్నుంచి ఆలోచించ కుండా గంట నడుచు కుంటూ వెళ్తే నీకు కావలసిన పాలెం వస్తుంది అక్కడ జనాబా అంతా వెనకబడిన తరగతుల వారుట మొత్తానికి ఎలాగైతేనేమ్ అన్ని రకాల వాహనాలు ఎక్కే వాహనయోగం పడ్తోంది అన్నారు మెల్లగా నవ్వుతూ–

నేనాయన మాటలు పెద్ద శ్రద్ధగా వినలేదు ఎలాగు వెళ్ళదల్చుకోనప్పుడు వినడం శుద్ధదండగ

ఎలాగైనా ఆ ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మార్పించు కోవాలి–

కనీసం టవున్ అయినా ఫర్వాలేదు–

ఏదో రెండు మూడేళ్ళు ఎక్స్‌పీరియన్స్ అయితే తరువాత పట్నంలోనే స్థిరపడి పోవచ్చు అదీగాక రెండు మూడేళ్ళ తరువాత ఎలాగు నేనే ప్రాక్టీసు పెట్టా లనుకుంటున్నాను

ఈ రెండు మూడేళ్ళ గురించి మారుమూల పల్లెకి వెళ్ళాలా?

వుద్యోగం వది లేస్తే ?

గవర్నమెంట్ వుద్యోగం వదల బుద్ధికావడం లేదు ఎలా?

అని ఆలోచిస్తున్న తరుణంలో –

పాండురంగా రావు గారని గవర్న మెంట్‌లో హై అఫిషియల్ పరిచయ మయ్యారు ఒకానొక మిత్రుడి ద్వారా

ఆయన్ని పట్టుకుంటే కనీసం టవున్ లో అయినా వుద్యోగం వస్తుంది

ఆయన్ని కలిసి అన్ని వివరాలు చెప్పి–

అంత పల్లెటూళ్ళో ఎలా వుండడం చెప్పండి? అంతా కొత్త అక్కడ మనుష్యులూ కొత్తే వాతావరణమూ కొత్తే అన్నాన్నేను

నా మాటలకి ఆయన మెల్లగా నవ్వుతూ–

కొత్తదేముందోయ్ అలవాటు అయితే అదే పాత పడుతుంది అని నన్ను ఒప్పించడాన్కి ప్రయత్నించారు–

నేను వినలేదు

ససేమిరా నాకా వూరు వెళ్ళడం ఇష్టం లేదని చెప్పాను

చివరికి ఆయన సరే నీకు సంబంధించిన వివరాలు రాసి ప్రయత్నిద్దాం అన్నారు

అన్ని వివరాలు రాసిచ్చాను

వచ్చేవారం కలవమన్నారు–

ఈ వారం లోపల ఇద్దరు' ముగ్గుర్ని కలిసి ప్రయత్నించాను కానీ పని మాత్రం జరగలేదు–?

పాండురంగా రావు గారు రమ్మన్న రోజు ఆయన దగ్గరకి వెళ్ళాను

ఆయన మళ్ళీ నన్ను ఒప్పించడాన్కి ప్రయత్నించి విఫలమయి–

నేనో వుత్తరం రాసిస్తాను అది తీసుకొని శేషగిరిరావు అని నా క్లాస్ మేట్ అతను ప్రస్తుతం హైదరాబాద్‌లో వుంటున్నాడు అతనిని కలిస్తే నీ పని సులభంగా అవుతుంది అన్నారాయన శేషగిరి రావు గారి ఎడ్రస్ ఇస్తూ-

ఎడ్రస్సు పాండురంగారావు గారి వద్ద లెటర్ తీసుకొని యింటికి చేరుకున్నాను-

మామయ్య అప్పుడే ఆఫీసు నుండి వచ్చాడు విషయాల్ని వివరంగా చెప్పాను-

మామయ్య నా మాట కాదన లేదు

కాదనడని నాకు తెలుసు !

నాన్నగార్కి ఎప్పుడూ ట్రాన్స్‌ఫర్ అవ్వడం వల్ల స్థిరంగా ఒకే ప్రాంతంలో వుండడం కుదరక పోవడం చేత మామయ్య గారింట్లోనే చదువు కున్నాను చిన్నప్పటి నుండి-

మామయ్య వాళ్ళకి సంతానం లేదు

చిన్నప్పటి నుండి అభిమానంతో సొంత కొడుకులా చూసుకున్నారు

ఒక్క మాటలో చెప్పాలంటే -

నాన్నగారి ఎదురుగా నుంచుని మాట్లాడాలంటే నాకిప్పటికీ భయమే మామయ్య దగ్గరైతే నిర్భయం దానికి మించిన చనువు!

నే నిప్పుడు మెడిసన్ చదవడాన్కి కారణం కూడా మామయ్యే- టెన్త్ క్లాస్ అయిన వెంటనే బి ఎ స లో చేర్తానన్నాను నేను నాన్నగారు ఎమ్ పి స లో చేరమన్నారు ఇంజనీర్ చేయాలని ఆయన కోరిక

## "యద్యదా చరతి శ్రేష్ఠః"

నాకు మెడిసన్ చదవాలని ఆకాంక్ష-

వాడు ఏది చదువుతానంటే అదే చదివించడం మంచిది బావగారు తన కిష్టమైన సబ్జెక్ట్ చదివినంత బాగా మరొక సబ్జెక్ట్ చదవలేడుగా అని నాన్నగార్ని ఒప్పించి నన్ను బి ఎ సి లో చేర్పించి నా మెడిసన్ చదువుకి నాంది పలికాడు మామయ్య-

నా అదృష్టం బాగుండి ఈ వూరి మెడికల్ కాలేజీలో నే సీట్ వచ్చింది మామయ్య గారింట్లో వుండే మెడిసన్ కూడా పూర్తి చేశాను

మామయ్య అంగీకారం పొంది నాన్నగార్కి అమ్మకి విషయాలు తెలియచేస్తూ వుత్తరం రాస ఆ రోజు సాయంత్రమే హైద్రాబాద్ బయలు దేరాను!

* * * * *

నేను వూహించిన దాని కన్నా సులభంగానే నా పని పూర్తయ్యింది

శేషగిరిరావు గార్ని కలిసిన వెంటనే ఆయన నా విషయాన్ని శ్రద్ధగా పరిశీలించి-

రికమండేషన్ లెటర్ యిచ్చారు-

ఆ లెటర్ మావూరులో వున్న సంబంధిత డిపార్ట్‌మెంట్‌లో వున్న ఆఫీసర్‌కి చూపెడ్తే పని అయినట్టే-!

ఆనందంతో తిరుగుముఖం పట్టాను!

* * * * *

ఇంటికి చేరే సరికి తాళం వేస వుంది

మామయ్యకి అత్తయ్యకి ఉత్సాహంగా అన్ని విషయాలు చెబ్దామనుకున్న నాకు నిరాశే మిగిలింది-

పక్కింటి వాళ్ళని తాళం యిచ్చారా? ఎక్కడికి వెళ్ళారు అని అడిగాను

వాళ్ళు నాకేసి ఓ క్షణం ఆశ్చర్యంగా చూసి-

మీకు తెలీదా? నిన్న రాత్రి మీ మామయ్య గార్కి వున్నట్టుండి గుండెల్లో పోటు వస్తే ఆస్పత్రికి తీసుకెళ్ళారు

ఆ మాట విని షాక్ తిన్నాన్నేను

నాలో మెల్లగా వణుకు

భగవాన్! మామయ్యకేం కాకూడదు!

ఆస్పత్రి పేరు కనుక్కొని-

అక్కడకి బయలు దేరాను

కాళ్ళలో వణుకు


ఏదో తెలియని బయం


నా గుండె కొట్టుకుంటున్న శబ్దం నాకే స్పష్టంగా విన్పిస్తోంది

నేను మెడిసన్ చదివినా మా వాళ్ళలో ఎవరికైనా సీరియస్‌గా వుందంటే అదో రక మైన బయంగా వుండేది


ఒక్కోసారి చదువు కోని వాడి కంటే చదువు కున్నవాడే ఎక్కువగా భయపడ్తాడేమో-

కాఫీ తాగడాన్కి కూడా ఆలోచించే మనస్తత్వం




తాజా వార్తలకు
ఆంధ్రపత్రిక దినపత్రిక
చదవండి.




కొందరిది
కాఫీలో కెఫిన్ అనే విషపదార్థముంటుంది !
అలాంటి మనస్తత్వం నాకు పూర్తిగా లేక పోయినా కొన్ని లక్షణాలు మాత్రం వున్నాయి-

వార్డులో
భూతంలో నిశ్శబ్దం
మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ
మామయ్య ఎడ్మిట్ అయిన గదికి చేరుకున్నాను

గుమ్మంలో నే నా కళ్ళకి బంధాలు పడ్డాయి

మృత్యువుతో పోరాడి ఓడి పోయాడు మామయ్య
గంభీరమైన వాతావరణాన్ని భయంకరంగా చీలుస్తూ అపశ్రుతి లా అత్తయ్య రోదన
ఎవరో ఓదారుస్తున్నారు

జాతస్యహి ధ్రువో మృత్యుః

నాన్నా వాళ్ళు దూరంగా వున్నా ఆ నిజాన్ని వూహకి కూడా రాకుండా తన చేతుల మీదుగా పెంచిన మామయ్య ఇక లేడు !

నేను వూరు వెళ్ళే వర కు బాగానే వున్న మనిష కేవలం రెండురోజుల్లో-
ఏమయినట్టు?

డాక్టర్ రూమ్ కేసి అడుగులు వేశాను
ఆ డాక్టరే మా ఫ్యామిలీ డాక్టర్
నన్ను చూసి-
కుర్చీలోంచి లేచి-
భుజం తడ్తూ సారీ మైడియర్ బాయ్ అన్నారు
నాలో ఏదో తహతహ
అంతరంలో తీవ్రమథనం
వాట్ వాట్ హేపెండ్ డాక్టర్ ? నేను వూరు వెళ్ళే వర కు బాగానే వున్నారు కేవలం ఈ రెండు రోజుల్లో
క్షణం తరువాత -
నిన్న రాత్రి గుండెల్లో విపరీతంగా నొప్పి వస్తోందని చెప్పార్ట మీ అత్తయ్యగారో ఆవిడ కంగారు పడి చుట్టు పక్కల వారి సహాయంతో ఇక్కడికి చేర్చారు జస్ట్ యిక్కడికి చేర్చేటప్పటికి కొంచెం ఆలస్య మయిందంతే జస్ట్ ఫైవ్ మినిట్స్ లేట్ ఇంక చెప్ప లేనట్టు మౌనంగా వుండి పోయారు
నాలో
వేల వేల ఆలోచనా తరంగాలు
కార్చిచ్చు లాంటి కఠిన నిజాలు కళ్ళకు కన్పిస్తున్నాయి
అగ్ని పర్వతాలు భగ్గున మండుతూ బ్రద్దలయి పోతున్నాయి
అరణ్యాలు దహించుకు పోతున్నాయి
గుండెని చీలుస్తున్న చురకత్తులు
అగ్ని తరంగాల రాపిడి
నింగి- నేల ఢీ కొన్నప్పటి శబ్ద ఘోష
నరాలు ఫగిలి పోతున్నాయి తల చిట్లి పోతోంది
ప్రళయం ప్ర ళయం
ప్ర ళ య ం!
మామయ్య అంత్య క్రియలు పూర్తయ్యాక నేనో నిర్ణయానికి వచ్చాను-
ఈ పది రోజులు తీవ్ర అంతర్ మదనానికి గురయ్యాను-
నా దగ్గరున్న రికమండేషన్ లెటర్ చింపేశాను
నే నా వూరు వెళ్తాను
నేనా వూరు వెళ్ళాలి
అవును
ఇక్కడ
ఈ మహాపట్నంలో
ఇంత మంది డాక్టర్లు
ఇంత మంది నర్సులు
ఇన్ని ఆస్పత్రులు
ఇన్ని మందులు
ఇన్ని మిషన్లు వుండగా-
కేవలం కొన్ని నిముషాలు ఆలస్యమవ్వడం వల్ల మామయ్య బ్రతకలేదు-!
అక్కడ
ఎక్కడో దూరంగా
వెళ్ళడాన్కి దారి కూడా సరిగ్గా లేని ఆ ప్రాంతంలో
ఆ మారుమూల పల్లెటూళ్ళో
డాక్టర్లంటూ వుండరు
నర్సులు వుండరు
మందులు దొరకవు (?)
మిషన్లు వూహకి కూడా రావు !
కనీసం
ఆస్పత్రిలాంటి దైనా వుంటుందో వుండదో?
మరి అక్కడి మనుష్యులో ?
నాటు వైద్యపు రాకాసి కోరల్లో
కళ్ళు పోగొట్టుకున్న వాళ్ళు
కాళ్ళు పోగొట్టుకున్న వాళ్ళు
మూఢ నమ్మకాల ఊబిలో
ప్రాణాల్ని సైతం బలి చేసుకున్న వాళ్ళు
ఎందరో
ఇంకెందరో
గుండె భరించ లేక పోతోంది ఆలోచనా వెల్లువని
మనిషిగా ఆలోచించు - అంతరాత్మ ప్రబోధన

నేనా వూరు వెళ్తున్నాను!

నా నిర్ణయం విని చాలా మంది ఆశ్చర్య పోయారు
పాండురంగా రావుగారు నా నిర్ణయానికి కొద్దిగా షాక్‌తిన్నా
వెరీగుడ్ మైడియర్ బాయ్ అంటూ అభినందిస్తున్నట్టుగా భుజం తట్టారు-

కళ్ళు మూసుకుంటే-
నా కళ్ళకి-
నన్ను ప్రేమగా తన ఒడిలో పెంచిన మామయ్య రూపం తన ఒడిలోకి రమ్మంటున్న పల్లె !, □